

# ఆకాశవాణి

### సంగీత సమీక్ష....

"పరుసవేది"

సోమవారం, డిశంబరు 1.

## ఎస్ సీతమ్మారావుగారి వీణావాద్యం

చక్కని మనోధర్మ కల్పనలతో రెండు ప్రసారాలలోనూ సున్నితంగా శ్రావ్యంగా వాయించారు వీరు. వచ్చినది ఏమీ లేదు అనుకుని పాండిత్యం బాగా సంపాదించాలనే కోరికతో కృషిచేస్తే ఈమె ముందుకి రాగలరు.

## గోనెళ్ల రామమూర్తిశాస్త్రిగారి పాట

ఇంపైన గాత్ర శారీరంతో నిర్మలమైన శైలిలో గానం చేశారు శాస్త్రిగారు. చురుకుగా దురిత కాలపు సంగతులు పలికే సాధనాలు చేసి వీరి గానానికి విలువ సంపాదించుకోవాలి. దేవమనోహరి రాగంలో "పదపమ, సనిదపమ" అనే ప్రయోగాలు బహుళంగా ఉపయోగించారు శాస్త్రిగారు. అది శాస్త్రవిరుద్ధం.

మంగళవారం డిశంబరు 5.

## చిత్రపు సత్యాదేవిగారి పాట

ఈమె కీర్తనలు శ్రవణానందంగా పాడుతున్నారు. ఆనందభైరవి కీర్తన నేడు బాగా పాడేరు. మనోధర్మ సంగీతముపై దృష్టి నిలిపి ఎక్కువగా కష్టపడకపోతే పేరు తెచ్చుకోవడం దుర్లభం. అరభిరత్నంకొంచెం దురితగతిని పాడితే బాగుండును.

## కె. ఎస్ వెంకట్రామయ్యగారి వాద్యం

ప్రసిద్ధమైనను విద్వాంసులలో వీరొకరు. వీరి వాద్యములో కల్పనాచాతుర్యము కంటే పరిశుద్ధమైన కర్ణాటక శైలి గమనింపదగిన విషయం. క్లుప్తముగా వాయించినప్పటికీ రాగములోని అందచందాలను నేర్పుగా ప్రదర్శించడంలో ఈయన ఘనుడు. వీరి శైలి నలవాటు చెయ్యడానికి ప్రయత్నం చెయ్యాల వైలిను విద్యార్థులు.

గురువారం, డిశంబరు 7

## కోటిపల్లి ప్రకాశరావుగారి వైలినువాద్యం

రక్తి చెడకుండా రెండుసార్లు బాగా వాయించారు ప్రకాశరావుగారు. వాయించే ప్రతీ విషయంలోనూ ఒక విశేషం ప్రదర్శించాలనే దీక్షతో పనిచేస్తే వాద్యం వినవేడుకగా ఉంటుంది. లేనంటే శ్రోతలు ప్రత్యేకమూ ఆకర్షింపబడరు.

శుక్రవారం, డిశంబరు 8.

## 'జానకీశపథం హరికథ'

విజయవాడ రేడియో నిలయంనుండి హరికథలు తృప్తిగా వినరావడం లేదు. హరిదాసులను పాట పాడడం పైమన్న శ్రద్ధ కథ చెప్పడంలో కనబడటంలేదు పాట తృప్తిగా ఉండడం చాలా అరుదు. రేడియో నిర్వాహకులు ఒక వారం హరికథ, మరియొకవారం రాగం, తానం, పల్లవి వినిపిస్తే చాలా బాగుంటుంది. మద్రాసు, తిరుచ్చి మైసూరులనుండి ప్రతీవారమూ వినబడే రాగము, తానము, పల్లవి విజయవాడనుండి మాత్రం ఏల ప్రసారం కాకూడదు.

శనివారం. డిశంబరు 9.

## కె. కణ్ణన్ గారి వేణువాద్యం.

తెనుగుదేశంలో ఇంపుగా వేణుగానం వినిపించాలి అంటే రేడియో నిలయవిద్వాంసు లొకరే కనపడుతున్నారు. నిలకడగా, రక్తిరంతంగా వేణువు వాయించగలిగిన విద్వాంసులు వీరొక్కరే ఉండడం తెలుగునాడు లోకలోటే. శనివారంనాడు కూడా ఒక గంట ప్రోగ్రాము ప్రసారం చెయ్యడం చాలా సంతోషకరము. కల్యాణిరాగం బాగా వాయించారు కణ్ణన్ గారు.

1950 దశకంలో ఆనందవాణి అనే పత్రికలో " ఆకాశవాణి - సంగీత సమీక్ష " శీర్షికతో ప్రచురించబడ్డ వ్యాస పరంపరలోని కొన్ని వ్యాసాలు ఇక్కడ చూడవచ్చు.

ఇలాటివి, మరియు ఆకాశవాణికి సంబంధించిన ఏ చిన్న భాగం అయినా, అది ఆడియో అవ్వొచ్చు, ఫోటో అవ్వొచ్చు, వ్యాసం అవ్వొచ్చు, మరేదైనా అవ్వొచ్చు, అవి మీ వద్ద వుంటే పంచుకోగలరని ఆశిస్తూ....

కాపీరైటు హక్కుల ఉల్లంఘున ఉద్దేశం లేదనీ, లాభాపేక్ష / ధనార్జన ఉద్దేశమంతకన్నా లేదనీ సవినయంగా తెలియచేసుకుంటూ - ఈ వ్యాసాలు ఇక్కడ, ఇలా రేడియో అభిమానులకు అందుబాటులో ఉంచటానికి అభ్యంతరాలు ఎవరికైనా ఉంటే తప్పక తెలియపర్చండి. క్షమాపణలతో వెంటనే తొలగిస్తాను.

భవదీయుడు

మాగంటి వంశీ మోహన్

http://www.maganti.org/